

దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్, మే 20: విద్యాసంవత్సరా(2024-25)నికి బెస్ట్ అవైలబుల్ పాఠశాలల పథకం కింద రెసిడెన్షియల్, నాన్-రెసిడెన్షియల్ ప్రవేశం కొరకు దరఖాస్తు స్వీకరిస్తున్నామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ అధికారి సజీవన్ ఒక ప్రకటనలో తెలిపారు. బెస్ట్ అవైలబుల్ పాఠశాలల పథకంలో జిల్లాకు 78సీట్లు కేటాయించగా 1వ తరగతిలో నాన్‌రెసిడెన్షియల్‌లో 38, 5వతరగతిలో రెసి డెన్షియల్‌లో 40సీట్లు కేటాయించామని తెలిపారు. అభ్యర్థులు కుల, ఆదాయ, పుట్టిన తేదీ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, పాస్ ఫొటోలతో జూన్7 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

డి క్యాటగిరీ ఓటింగ్ యంత్రాల భద్రతకు చర్యలు

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే



స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మే 20: డి కేటగిరి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతగా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికలఅధికారి, కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. సోమవారం అదనపుకలెక్టర్ దాసరి వేణు, తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే, ఎన్నికల పర్యవేక్షకులు మధుకర్, ఎన్నికల ఉపతహసీల్దార్ జితేందర్, రాజకీయపార్టీ ప్రతినిధుల సమక్షంలో జిల్లా వేర్‌హౌజ్ నుంచి జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంలో గల సీఅండ్‌డీ క్యాటగిరిస్ట్రాంగ్ రూంకు డి క్యాటగిరి ఈవీఎంలను తరలించి భద్రపరిచారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లావేర్‌హౌజ్ నుంచి డికేటగిరి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను తరలించి భద్రపరిచామన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

ఆసిఫాబాద్, మే 20: ప్రయాణంలో ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా రవాణాశాఖ, పంచాయతీ రాజ్, రోడ్డు, భవనాల, మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రత చర్యల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన అన్నారు. జిల్లాలో బ్లాక్‌స్పాట్ జాబితాలో ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రవాణాదారులపై ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉన్నందున నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ రాజ్, రోడ్డు భవనాలు, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు సమన్వయంతో విచారణ జరిపి బ్లాక్ స్పాట్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పశువులు రోడ్లపైకి రాకుండా యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించటం, కార్లు, ఇతర వాహనా లలో సీట్‌బెల్టు ధరించడం, రోడ్డు భద్రత నియమాలను పాటించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. స్పీడ్‌బ్రేకర్లు, మూలమలుపులు, ప్రమాద ప్రాంతాలు తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రోడ్లు అనుసంధాన ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆటోలు, వాహనాలలో పరి మితికి మించి ప్రయాణికులను తరలించకుండా చర్యలు తీసు కోవాలన్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణమే వైద్య సాయం అందించే 108అంబులెన్స్ వినియోగంపై ప్రజలకు వివరించాలన్నారు. కేజ్ వీల్స్‌తో రహదారులపై వాహనాలు నడపకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాహనంనడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్సు పొంది ఉండాలన్నారు. రోడ్డు భద్రతపై ప్రతినెల అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఎస్పీ సురేష్‌కుమార్ మాట్లాడుతూ వివిధశాఖల సమన్వయంతో రోడ్డుప్రమాదాల నివారణకుచర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆర్టీసీ బస్సులు, లారీలు, ఇతర వాహనాలు నడిపే సమయంలో భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాల న్నారు. జిల్లాలో 2021లో 68, 2002లో 57, 2023లో 70 ప్రమాదాలు జరిగాయని ఈప్రమాదాల్లో 450 మందివరకు మృతిచెందారని అన్నారు. జిల్లాలో45 బ్లాక్‌స్పాట్ లను గుర్తించామన్నారు. జాతీయ రహదారులశాఖ అధికారుల సమ న్వయంతో ఆయాప్రాంతాల్లో ప్రమాదాలనివారణకు ప్రత్యేకచర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కెరమెరి, మే 20: మండలంలోని పలుగ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ విద్యుత్‌లైన్‌లో సాంకేతిక సమస్యల దృష్ట్యా ఉదయం 9నుంచి 11 గంటలవరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.



కలగానే 'తలాయి' జలవిద్యుత్ కేంద్రం

● ఏళ్లు గడుస్తున్నా కార్యరూపం దాల్చని వైనం ● ప్రస్తుత ప్రభుత్వమైనా దృష్టి పెట్టేనా?

బెజ్జూరు, మే 20: బెజ్జూరు మండలంలోని తలాయి గ్రామ సమీపంలో జలవిద్యుత్ కేంద్రం నిర్మించాలన్న ప్రతిపాదన అమలుకు నోచుకోవడం లేదు. ప్రాణహిత నదిపై జలవిద్యుత్ కేంద్రం నిర్మాణానికి నిజాం హయాంలోనే సర్వేలు జరిపి పనులు ప్రారంభించారు. అప్పట్లో నిర్మించిన పిల్లర్లు ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. నిజాం ప్రభుత్వం పతనంతో పనులు నిలిచిపోయాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే జలవిద్యుత్ కేంద్రం పనులు మొదలవుతాయని భావించిన ఈ ప్రాంత ప్రజల ఆశలు ఆవిరయ్యాయి. ఉమ్మడి ప్రభుత్వ హయాంలో తలాయి జలవిద్యుత్ కేంద్రంపై పాలకులెవ్వరూ స్పందించకపోవడంతో ప్రాజెక్టు నిర్మాణం మరుగున పడింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఆ దిశగా దృష్టి సారించకపోవడంతో జలవిద్యుత్ కేంద్రంపై నీలినీడలు కమ్ముకున్నాయి. జలవిద్యుత్ కేంద్రం నిర్మాణానికి అనుకూలంగా ఉన్నప్పటికీ పాలకులు పట్టించుకోని కారణంగా ఏటేటా ఆ ప్రతిపాదన చరిత్రలో కలిసిపోతోంది. నిజాం ప్రభుత్వం హయాంలో చేపట్టిన ఈ ప్రతిపాదనను ఇప్పటితరం నాయకులెవ్వరు పట్టించుకోకపోవడంతో దీని మూలంగా ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోవడం లేదు.

ఉమ్మడి ప్రాజెక్టుగా..

తలాయి గ్రామ సమీపంలోని ప్రాణహిత నదిపై ప్రాజెక్టు నిర్మాణం కోసం తెలంగాణ-మహారాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రాణహితనదిపై ప్రస్తుతం మహారాష్ట్రలో ఉన్న దేవలమర్రి, తెలంగాణలోని తలాయి గ్రామాల మధ్య జలవిద్యుత్ కేంద్రం నిర్మాణానికి నిజాం ప్రభుత్వం సర్వేలు చేపట్టింది. అప్పట్లో ఈ రెండు గ్రామాలు ఒకే ప్రభుత్వ పరిధిలో ఉండేవి. ఈలోగా నిజాం ప్రభుత్వం పతనం కావడంతో తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వం రెండో దఫా సర్వేలు చేసింది. ప్రభుత్వాలు మారినా 1952 నుంచి 1954 వరకు దాదాపు పద్దెనిమిది నెలల పాటు సర్వే చేసినట్లు స్థానికులు తెలుపుతున్నారు. 1955లో ఇక్కడికి కొన్ని యంత్రాలు ఇతర పరికరాలను సైతం తీసుకువచ్చారు.

అదే ఏడాది అక్కడ పని చేస్తున్న ఇంజనీరింగ్ అధికారుల ప్రైవేటు గుమాస్తా భార్య ప్రమాదవశాత్తు తెల్ల ఇసుక మడుగులో పడి మృతి చెందడంతో కొంత కాలం పాటు పనులు నిలిచిపోయాయి. 1956 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఆవిర్భావం జరగడంతో ఈసర్వే ముందుకు జరగలేదు. ఈ లోగా భాషాప్రాదిపదికన రాష్ట్రాలు ఏర్పడటంతో ప్రాణహిత నది రెండు రాష్ట్రాలకు సరిహద్దుగా మారింది. హైదరాబాద్ రాష్ట్రంలో కలిసి ఉన్న చంద్రాపూర్, గడ్చిరోలి జిల్లాలు మహారాష్ట్రలో కలిసిపోయాయి. దేవలమర్రి గ్రామం సైతం మహారాష్ట్రలో కలిసింది. దీంతో ఈ ప్రాజెక్టు రెండు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టుగా మారింది. 1956లో ఇక్కడికి తీసుకవచ్చిన యంత్ర సామగ్రి సైతం వెనక్కి తీసుకువెళ్లారు.

2007లో జెన్‌కో సర్వే..

తలాయి వద్ద జలవిద్యుత్ కేంద్రం నిర్మాణం కనుమరుగైపోతున్న నేపథ్యంలో చాలా ఏళ్ల తర్వాత అప్పటి ఉమ్మడి ప్రభుత్వ హయాంలో 2007లో ఏపీ జెన్కో అధికారులు తలాయి వద్ద ప్రాణహిత నదిని సందర్శించారు. ఇక్కడ జలవిద్యుత్ కేంద్రం 100మెగా వాట్ల విద్యుత్‌సామర్థ్యం గల విద్యుత్పత్తి జరుగుతుందని అంచనా వేసిన జెన్కో అధికారులు తమకు కేవలం 25మెగావాట్ల సామర్థ్యం వరకే తమ చేతుల్లో ఉందని వెనుతిరిగారు. దీంతో దశాబ్దాల కాలంగా ఈ ప్రాజెక్టు విషయంలో ఎవ్వరూ కూడా చొరవ చూపడం లేదు. దీంతో ఇది క్రమేణా చరిత్రలో కలిసిపోయింది. 2009లో ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని ఆర్థికమంత్రి తన్నీరు హరీశ్‌రావు సైతం తలాయిని సందర్శించారు. ఆసమయంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఇక్కడ విద్యుత్‌కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుం టామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు కావస్తున్నా దాని గురించి ప్రస్తావనే లేదు. ఇక్కడ జలవిద్యుత్ కేంద్రం నిర్మాణం చేపట్టినట్లయితే తెలంగాణ మహారాష్ట్రలకు రవాణా పరంగా అభివృద్ధి జరిగి ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు ఏర్పడే అవకాశం ఉంది. అంతేకాకుండా ఈ ప్రాజెక్టు నిర్మాణం ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మొత్తానికి విద్యుత్ సరిపోయే అవకాశం ఉంటుంది.

ఉపాధి కలిగే అవకాశం..

బోగ సంతోష్, బెజ్జూరు



తలాయి ప్రాణహిత నది వద్ద జలవిద్యుత్ కేంద్రం నిర్మించినట్లయితే ఈ ప్రాంత ప్రజలకు మెండుగా ఉపాధి దొరికే అవకాశం ఉంది. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ జలవిద్యుత్ కేంద్రం నిర్మాణం చేపడతారని ఆశగా ఎదురు చూస్తున్నాం.

కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించేనా?

ఉమ్మడి రాష్ట్రంలో రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో అప్పటి జెన్కో అధికారులు 2007లో తలాయి వద్ద జలవిద్యుత్ కేంద్రం స్థలాన్ని పరిశీలించారు. కొన్ని రోజులు సర్వేలు చేశారు. కాగా ఆయన మరణానంతరం దీనిపై దృష్టి సారించేవారు లేకపోవడం, అనంతరం తెలంగాణ ఉద్యమం జోరందుకోవడం, అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం జరిగిపోయింది. అప్పట్లో మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా ఈ ప్రాంతాన్ని సందర్శించి తెలంగాణ ఏర్పడితే జలవిద్యుత్ కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం అవ్వన్నీ కాలగర్భంలో కలిసిపోవడం జరిగింది. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రాంత వాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జెన్కో అధికారులు సర్వేలు చేయడం ద్వారా మళ్లీ ఇక్కడ సర్వేలు జరిపితే ఈ ప్రాంతం అభివృద్ధి జరిగే అవకాశం మెండుగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నట్లయితే ఈ ప్రాంతంలో విద్యుత్ సదుపాయం కలగడంతోపాటు ఇక్కడి వారికి ఉపాధి కలిగే అవకాశం ఉన్నందున దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పాలకు లు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రాణహి త నది వద్ద ప్రాజెక్టు నిర్మించి ఈ ప్రాంత యువత కు ఉపాధి కల్పించాలి.

ప్రాజెక్టుతో ఇరు ప్రాంతాల అభివృద్ధి..

జలపతి, తలాయి



నిజాం ప్రభుత్వ హయాంలో పురుడు పోసుకున్న తలాయి జలవిద్యుత్ కేంద్రాన్ని పాలకులు పట్టించుకోని కారణంగా ఈ ప్రాంతం అన్నిరంగాల్లో వెనుకబాటుకు గురవుతోంది. ఇక్కడ ప్రాజెక్టు నిర్మిస్తే తెలంగాణ-మహారాష్ట్ర ప్రాంతాలు రవాణ, వ్యాపార రంగాల్లో అభివృద్ధి చెందే వీలు కలుగుతుంది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి. తలాయి వద్ద ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సౌకర్యం కలుగుతుంది.



నిజాం హయాంలో వేసిన పిల్లర్(ఫైల్)

అప్పట్లో వేసిన పిల్లర్లు ..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆవిర్భావానికి ముందు నిజాం ప్రభుత్వం మొదటగా తలాయి వద్ద జలవిద్యుత్ కేంద్రం ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించింది. తలాయి వద్ద ప్రాణహిత నదిలో పుష్కలంగా నీరు ఉండటంతో వృథాగా పోతున్న జలవనరులను సద్వినియోగం చేసు కోవాలన్న సదుద్దేశ్యంతో నిజాం ఇక్కడ జలవిద్యుత్ కేంద్రం ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. నిజాం హయాంలో ప్రాణహిత నదిలో జల విద్యుత్ కేంద్రం నిర్మాణానికి చేపట్టిన పిల్లర్లు నేటికీ దర్శనమిస్తున్నాయి. అనంతరం నిజాం ప్రభుత్వం పతనం తర్వాత కొద్దిరోజులు సర్వేలు జరిపినా ఎలాంటి పురోగతి కనిపించలేదు. దీంతో తర్వాత ఈ ప్రాజెక్టు విషయంలో ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడంతో కలగానే మిగిలి పోయింది.

23 నుంచి ఉపాధిహామీ సామాజిక తనిఖీలు

కెరమెరి, మే 20: ఈనెల23 నుంచి మండలంలో ఉపాధిహామీ సామాజికతనిఖీ గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కృష్ణారావు తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12వవిడత సామాజిక తనిఖీల్లో భాగంగా 01.04.2023 నుంచి 31.03.2024 వరకు వివిధ గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీపనులపై సామాజికతనిఖీ బృందాలతో సోషల్ ఆడిట్ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏపీవో మల్లయ్య,ఎంపీవో అంజద్‌పాషా,కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలు పునఃప్రారంభంలోగా

పనులు పూర్తిచేయాలి

● అదనపు కలెకర్ దీపక్ తివారి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, మే 20: విద్యాసంవత్సరం(2024-25)లో పాఠశాలలు పునః ప్రారంభం అయ్యేలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి, మరమ్మతు పనులు పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖాధికారి అశోక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా గిరిజనఅభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్‌తో కలిసి మండలపరిషత్ అధికారులు, పంచాయతీ అధికారులు, ఐకేపీ ఏపీఎంలు, ఉపాధిహామీ పథకం ఏపీవోలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పాఠశాలల అభివృద్ధి పనులు, ఏకరూప దుస్తులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అమ్మఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా అన్ని ప్రభుత్వపాఠశాలలో అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా ఆయా పనులను పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, మూత్రశాలలు, విద్యుదీకరణ పనులతోపాటు తరగతిగదుల మరమ్మతులు, బాలికలకు ప్రత్యేకమూత్రశాలలు పనులు చేపట్టిన పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించేందుకు జిల్లావ్యాప్తంగా దుస్తులతయారీకి 78కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అధికారులు ఆయాకేంద్రాలను పర్యవేక్షిస్తూ పనులను వేగవంతంగా చేసే దిశగా కృషిచేయాలని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద జిల్లాలో చేపట్టిన పనులలో కూలీల హాజరుశాతాన్ని పెంచి పనులు త్వరగా చేసేలా అధికారులు కృషిచేయాలని తెలిపారు. సమాశంలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీఎంలు, ఏపీవోలు పాల్గొన్నారు.

బౌద్ధ పౌర్ణిమ వేడుకలను ఘనంగా జరుపుకోవాలి

వాంకిడి, మే 20: జిల్లావ్యాప్తంగా ఈనెల23న బౌద్ధ పౌర్ణిమ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని బీఎస్ఐ జిల్లా అధ్య క్షుడు అశోక్ మౌల్కర్ కోరారు. ప్రతిగ్రామంలో పంచశీల జెండాను ఎగురవేసి సాయంత్రం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వ హించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అంబేద్కర్ యువజన సంఘం, రమాబాయి మహిళామండలి, బౌద్ధ మహాసభ సభ్యులు తమ వంతు కృషి చేయాలని కోరారు.

కేకే ఓసీ హెచ్ఎంఎస్ పిట్‌కార్యదర్శిగా బేతి మౌనిక



బేతి మౌనిక

మందమర్రి టౌన్, మే 20: మందమర్రిఏరియాలోని కేకేఓసీలో బదిలీవర్కర్‌గా పనిచేస్తున్న బేతిమౌనిక హెచ్ఎంఎస్ పిట్‌కార్యదర్శిగా నియమితుల య్యారు. సోమవారం ఆమెను నియమిస్తూ హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్‌అహ్మద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మౌనిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నిరుద్యోగ యువకులు

చెన్నూరు, మే 20: మండలంలోని లంబాడిపల్లి గ్రామ సమీపంలో సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ పవర్‌ప్లాంటులో స్థానిక యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని సోమవారం లంబాడిపల్లి యువకులు శ్రీరాంపూర్ ఏరియా జీఎంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చెన్నూరు మండల ఎస్టీయూనియన్ ప్రెసిడెంట్ నగావత్‌మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు కార్మికులకు ఏరియర్స్ వెంటనే చెల్లించాలి

బెల్లంపల్లి, మే 20: సింగరేణి వ్యాప్తంగా గ్రాట్యూటీ చెల్లింపులో అన్యాయానికి గురైన రిటైర్డు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.10లక్షల ఏరియర్స్ వెంటనే చెల్లించాలని టీఎన్ టీయూసీ ప్రధానకార్యదర్శి మణిరాంసింగ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు. సింగరేణిలో 2016నుంచి 2018మధ్య కాలంలో రిటైర్ అయిన కార్మికులకు పెరిగిన గ్రాట్యూటీని చెల్లించలేదని దీని వల్ల సుమారు 3816మంది కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు. వీరికి దాదాపు ఒక్కొక్కరికి రూ.10లక్షల వరకు సింగరేణి యాజమాన్యం చెల్లించాల్సి ఉందని, వీటిని వెంటనే చెల్లించాలని కోరారు.సమావేశంలో నాయకులు గద్దెల నారాయణ, చంద్రమౌళి, వెంకటస్వామి, పాషా, జీవరత్నం, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నాసిరకమైన పనిముట్లతో ఇబ్బందులు

శ్రీరాంపూర్, మే 20: నాసిరకమైన పనిముట్లు ఇచ్చి కార్మికులను ఇబ్బందులకు గురిచేయవద్దని ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా అన్నారు. ఆర్‌కె న్యూటెక్ గనిపై సోమవారం కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, డ్రిల్‌రాడ్స్, డ్రిల్‌బిట్స్ కొరత ఉందన్నారు. సర్వేఆఫ్ అయినా ఎస్‌డీఎల్ యంత్రాలు నడపడం వల్ల ఆపరేటర్లు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎస్‌డీఎల్ యంత్రాల్లో నాసిరకం ఆయిల్ వాడడం వల్ల యంత్రాలు పాడైపోతున్నా యన్నారు. అనంతరం మేనేజర్‌తో కలిసి సమస్యల గురించి చర్చించి, పరిష్కారానికి కృషి చేయాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు బాజీసైదా పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ సంపత్, పిట్‌కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, నాయకులు గజ్జి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నార్థకంగా మందమర్రి ఏరియా భవిష్యతు

● హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్



మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ ప్రధానకార్యదర్శి రియాజ్ అహ్మద్

మందమర్రి టౌన్, మే 20: పారిశ్రామిక ప్రాంతమైన మందమర్రి ఏరియా ఒకప్పుడు కార్మికులతో కలకలలాడిందని, ప్రస్తుతం ఏరియా భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని హెచ్ఎంఎస్ ప్రధానకార్యదర్శి రియాజ్ అహ్మద్ అన్నారు. సోమవారం మందమర్రిలోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఏరియాలోని కేకే1, ఆర్కే1ఏ గనులు మూతపడ్డాయని, ఆర్కేఓసీ కూడా త్వరలో మూతపడనుందని తెలిపారు. దీంతో ఇందులో పనిచేస్తున్న కార్మికులను ఏరియాలో సర్దుబాటు చేసినా ఇప్పటికే చాలామంది ఇతర ఏరియాలకు కూడా బదిలీ అయి వెల్లారన్నారు. గతంలో చాలా గనులు మూత పడ్డాయని పేర్కొన్నారు. ప్రస్తుతం మందమర్రి ఏరియాకు పూర్వ వైభవం రావాలంటే ఇప్పటికే సర్వే పూర్తయినటువంటి కేకే6 భూగర్భ గనితోపాటు శ్రావణపల్లి ఓసీని ప్రారంభించాలని కోరారు. దీనిద్వారా చాలా మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కొత్త గనులు, నూతన ఉద్యోగాలు ఏకైక లక్ష్యంగా హెచ్ఎంఎస్ కృషి చేస్తుందన్నారు. చాలామంది త్వరలో ఉద్యోగ విరమణ పొందనున్న దృష్ట్యా నూతనగనులు రావాలని, దీనికి ప్రణాళికబద్ధంగా హెచ్ఎంఎస్ పోరాటాలు చేస్తుందని, త్వరలో ఈ విషయంపై ముఖ్యమంత్రిని కలిసి విన్నవిస్తామన్నారు. సమావేశంలో వర్కింగ్‌ప్రెసిడెంట్ కృష్ణప్రసాద్, అధ్యక్షులు జక్కుల నారాయణ, మందమర్రి ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు అనిల్, వెల్ది సుదర్శన్‌గౌడ్, రామస్వామి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన అధికారులను తొలగించాలి

జైపూర్: జైపూర్ మండలకేంద్రంలోని ఎస్టీపీపీలో పనిచేసి పదవీవిరమణ పొందిన అధికారులను ఉద్యోగాల నుంచి తొలగించాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్టీపీపీ ముందు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్టీపీపీలో పనిచేసే డిప్యూటీ సూపరింటెండెంట్‌ఆఫ్‌ఇంజనీర్ కిరిటీది ఆత్మహత్యకాదని.. విజిలెన్స్ అధికారులు ఎంక్వైరీ పేరిట చేసిన హత్య అని మండిపడ్డారు. కిరిటీ సూసైడ్ నోట్‌లో ఉన్న పేర్లు బయట పెట్టాలన్నారు. వెంటనే ఎస్టీపీపీలో పదవీవిరమణ పొందిన అధికారులను ఉద్యోగాల నుంచి తొలగించాలన్నారు. విజిలెన్స్ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సీఎంవోపీ అధ్యక్షుడు కూడా ఇప్పటివరకు స్పందించకపోవడం విచారకరమన్నారు. సింగరేణి సీఎండీ బలరాం కిరిటీ కుటుంబాన్ని పరామర్శించి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్‌లు కృష్ణప్రసాద్, ప్రదీప్‌రెడ్డి, నాయకులు అనిల్‌రెడ్డి, విక్రమ్, కిరణ్‌కుమార్, సాయికృష్ణరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మందమర్రి టౌన్: మందమర్రి ఏరియాలోని కేకేఓసీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని హెచ్ఎంఎస్ ప్రధానకార్యదర్శి రియాజ్ అహ్మద్ తెలిపారు. సోమవారం కేకేఓసీలో కార్మికులను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడారు. నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలంటే కార్మికులకు సమస్యలు రాకుండా చూడాలని, నాణ్యమైన పనిముట్లు అందజేయాలన్నారు. కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేయాలన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణప్రసాద్, అధ్యక్షుడు జక్కుల నారాయణ, ఏరియా ఉపాధ్యక్షుడు జె శ్రీనివాస్, నాయకులు వెల్ది సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి

● కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం

మందమర్రి టౌన్, మే 20: మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ సీహెచ్‌పీలో పనిచేస్తున్న సేల్ పికింగ్ కాంట్రాక్టు కార్మికుల పెండింగ్‌లోఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కాంట్రాక్టు కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం తెలిపారు. సోమవారం ఆయన మందమర్రిలో విలేకరులతో మాట్లాడుతూ కాంట్రాక్టుకార్మికుల కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తున్నాయన్నారు. సీహెచ్‌పీలో పనిచేస్తున్న 16మంది కాంట్రాక్టు కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ఇప్పటికే ఈవిషయంపై యాజమాన్యాలతో మాట్లాడితే ఎన్నికల కోడ్ అని చెబుతున్నారని, కష్టపడ్డ కాంట్రాక్టు కార్మికుల వేతనాలు చెల్లించకుంటే వారి జీవనం ఎలా సాగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా స్పందించి వారికి వేతనాలు చెల్లించేవిధంగా కాంట్రాక్టర్, యాజమాన్యం ముందుకు రావాలన్నారు. వారంరోజుల్లో చెల్లించనిపక్షంలో కాంట్రాక్టు కార్మికుల సంఘం ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేపడతామన్నారు.

అడ్మిషన్ల మాయాజాలం

- పది విద్యార్థుల కోసం జూనియర్ కళాశాలల వేట
- మాయమాటలతో తల్లిదండ్రులపై వల

రామకృష్ణాపూర్, మే 20: పదో తరగతి పరీక్షలు పూర్తి కాగానే విద్యార్థుల కోసం ప్రైవేటు జూనియర్ కళాశాల యాజమాన్యాలు అడ్మిషన్ల కసరత్తు ప్రారంభించాయి. ఇప్పటికీ విద్యార్థుల జాబితా సిద్ధం చేసుకొని గ్రామాల్లో వాలిపోతున్నారు. ఆయా కాలేజీల ఏజెంట్లు. తల్లిదండ్రులను మాయమా టలతో బుట్టలో వేసుకునేందుకు రంగంలోకి దిగారు.

అడ్డగోలుగా ఫీజులు వసూలు

కాలేజీ గురించి గొప్పగా చెప్పిన అనంతరం మెల్లగా గాలం వేస్తారు. అసలు ఫీజులు కట్టనవసరం లేదంటారు. బస్సు ఫీజు, పరీక్షల ఫీజు చెల్లిస్తే సరిపోతుందని చెబుతారు. తీరా పరీక్షల సమయం వచ్చేసరికి ముక్కుపిండి ఫీజులు వసూళ్లు చేస్తారు. స్కాలర్‌షిప్ కూడా కళాశాల యాజమాన్యాలే తీసుకొంటారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని అన్ని కళాశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

ర్యాంకర్లపైనే దృష్టి....

కాలేజీలో చేరిన తర్వాత మీ విద్యార్థిని సెక్షన్-ఏలో చేరుస్తామని చెబుతారు. ఒకనెల గడిచిన తర్వాత మీ పిల్లవానికి తక్కువ మార్కులు వచ్చాయని చెప్పి సెక్షన్ మారుస్తున్నట్లు చెబుతారు. రెండు మూడు నెలల తర్వాత చురుకైన విద్యార్థులు ఎవరున్నారో గమనించి వారందరినీ కలిపి కొత్త సెక్షన్ ఏర్పాటు చేస్తారు. ఇక్కడి నుంచి యాజమాన్యం దృష్టి మొత్తం ఈ బ్యాచ్ పైనే. ర్యాంకుల కోసం, వాటిని అడ్డుపెట్టుకొని వచ్చే ఏడాది బిజినెస్ కోసం విద్యార్థులపై ఒత్తిడి తెస్తారు. అదే సమయంలో మిగిలిన విద్యార్థులను గాలికి వదిలేస్తారనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

చెక్ పెట్టేదెవరు..?

ప్రభుత్వం ఎన్ని నిబంధనలు పెట్టినప్పటికీ ప్రైవేటు కాలేజీల విచ్చలవిడితనాన్ని అరికట్టలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. పరీక్షల ముందు హాల్ టికెట్లు ఇచ్చే సమయంలో ఎన్నో ఇబ్బందులకు గురిచేస్తున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఆ సమయంలో పిల్లల్ని చేర్పించిన ఏజెంట్ కనిపించడని, తప్పని పరిస్థితుల్లో ఫీజులు అధిక మొత్తంలో చెల్లించాల్సి వస్తోందని అంటున్నారు. హాల్ టికెట్స్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుండడంతో రాష్ట్ర విద్యాశాఖ ఇంటర్నెట్ నుంచి నేరుగా హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకొని, నేరుగా పరీక్షలకు హాజరయ్యే వెసలుబాటు 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవకాశం ఇచ్చింది.

తస్మాత్ జాగ్రత్త....

తమకు ర్యాంకులు ఇన్ని వచ్చాయని, అత్యధికంగా మార్కులు వచ్చాయని చెబుతున్న కాలేజీలు పాస్ పర్సెంటేజ్ వెల్లడించకపోవడం గమనార్హం. అందువల్ల తల్లిదండ్రులు మేల్కోవా ల్సిన అవసరం ఉంది. నేరుగా కళాశాలలకు వెళ్లి ఆ కాలేజీలో సౌకర్యాలను పరిశీలించడం, అక్కడ చదివిన విద్యార్థుల ద్వారా పూర్తి సమాచారాన్ని సేకరించిన తర్వాతే కళాశాలలో పిల్లలను చేర్పిస్తే బాగుంటుంది. లేదంటే ఆ తర్వాత ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి రావొచ్చు. తస్మాత్ జాగ్రత్త.

చింతపల్లి రజక యువజన సంఘం కమిటీ

దండేపల్లి, మే 20: చింతపల్లి రజక యువజన సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్కూరి రాజన్న, మండల అధ్యక్షుడు పుట్టపాక తిరుపతిలు తెలిపారు. యువజన సంఘం గౌరవ అధ్యక్షుడిగా కుదురుపాక ఇందూర్, అధ్యక్షుడిగా తాడూరి రమేష్, ఉపాధ్యక్షులుగా పుట్టపాక సాయి ప్రశాంత్, గంప సాయి, ప్రధాన కార్యదర్శిగా పుట్టపాక నగేష్, కోశాధికారిగా గుండారపు రాజు, ప్రచార కార్యదర్శిగా కుదురుపాక రోహత్, సంయుక్త కార్యదర్శులుగా గంప వెంకటేష్, సల్లూరి నరేష్, కార్యవర్గ సభ్యులుగా తాడూరి మధుకర్, ముక్కెర సురేష్, పుట్టపాక వెంకటేష్, దావనపల్లి సతీష్, కుదురుపాక మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు తెలిపారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి

హాజీపూర్, మే 20: అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. సోమవారం వేంపల్లిలో గల అమ్మ ఆదర్శ పాఠశాల, గుడిపేటలోని ఏకరూప దుస్తుల కుట్టు కేంద్రాన్ని ఎంపీడీవో మధుసూదన్‌తో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ తరగతులు ప్రారంభమయ్యేలోగా పాఠశాలల్లో చేపట్టిన పనులను పూర్తి చేయాలన్నారు. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థినీ, విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించేం దుకు అధికారులు కుట్టు కేంద్రాలను పర్యవేక్షిస్తూ పనులను వేగవంతం చేసే దిశగా కృషి చేయాలన్నారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

లోలెవల్ వంతెన పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న డీఈ నిరంజన్‌రావు

పెంచికలపేట, మే 20: ఎర్రగుంట ఉచ్చమల్ల వాగుపై నిర్మిస్తున్న లోలెవల్ వంతెనపనులను సోమవారం ఐటీడీఏ డీఈ నిరంజన్‌రావు పరిశీలించారు. పనులు వేగంగా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నాణ్యతప్రమాణాలు పాటిస్తూ నిర్దేశించిన గడువులోగా లోలెవల్ వంతెననిర్మాణపనులుపూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య



జాదవ్ యాదగిరి(ఫైల్)

లింగాపూర్, మే 20: మండలంలోని కిమానాయక్‌తండాలో సోమవారం ఉద యం జాదవ్ యాదగిరి(39) ఉరివేసు కుని ఆత్మహత్య చేసుకున్నాడు. లింగా పూర్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివ రాల ప్రకారం.. మండలంలోని కిమానా యక్ తండాకి చెందిన జాదవ్ యాద గిరికి 16సంవత్సరాల క్రితం లింగాపూర్ గ్రామానికి చెందిన వనితతో వివాహం జరిగింది వారికి ఇద్దరు కుమార్తెలు ఒక కొడుకు ఉన్నాడు. ఇంటి అవసరాల కోసం రెండేళ్ల క్రితం 2లక్షల 50వేలు అప్పు చేశారు. ఆఅప్పు ఎలాతీర్చాలో అని యాదగిరి తరచూ బాధపడు తుండేవాడు. వారంక్రితం 10ఎకరాల రైతుబంధు అకౌంట్‌లో పడ్డాయి. వాటిని కుటుంబసభ్యులకు తెలియకుండా వృథాగా ఖర్చు చేశాడు. కుటుంబసభ్యులు ఆదివారం రాత్రిఒకచోటకూర్చుని సోమవారం ఖాతాలోని డబ్బులుతీసి అప్పులు కట్టుకుందామని నిర్ణయించుకుని పడుకున్నారు. అయితే ఖాతాలో డబ్బులు లేవని తెలిస్తే ఏం సమాధానం చెప్పాలని మనస్తాపానికిగురై సోమవారం తెల్లవారు జామున పశువులకొట్టంలో ఉరేసుకొని మృతిచెందాడు. గమనించిన ఇరుగుపొరుగువారు కుటుంబసభ్యులకు సమా చారం అందించారు. అనంతరం పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృత్యుడిభార్య వనితఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

జర్నలిస్టుపై దాడి: పోలీసులకు ఫిర్యాదు

కాగజ్‌నగర్, మే 20: కాగజ్‌నగర్ మండలం చారిగాంలో జేసీబీతో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతుండగా ఫొటోలు తీసేందుకు వెళ్లినస్థానిక పాత్రికేయుడు తిరుపతిపై నిర్వాహకులు దాడి చేశారు. ఈ మేరకు బాధితుడు కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈసందర్భంగా ఎస్సై సోనియా మాట్లాడుతూ తమకు ఫిర్యాదు అందిందని, విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

దాడిని ఖండించిన పలు సంఘాలు..

పాత్రికేయుడు తిరుపతిపై దాడిచేసిన వారిపై వెంటనే కేసు నమోదుచేయాలని పలు సంఘాలు డిమాండు చేశాయి. పాత్రికేయుడిపై దాడికి పాల్పడిన వారిపై కొత్త చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని, లేనిపక్షంలో మంగళవారం జిల్లా, రాష్ట్ర స్థాయిలో ధర్నా చేపడుతామని కాగజ్‌నగర్ ప్రెస్‌క్లబ్, ఎలక్ట్రానిక్ మీడియా సంఘం నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

కాగజ్‌నగర్ టౌన్, మే 20: కాగజ్‌నగర్ మండలగం గన్నారంలో చంద్రశేఖర్(27) అనే యువకుడు సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్టు ఈసుగాం ఎస్సై రామన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు చంద్రశేఖర్ కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

దేశీదారు స్వాధీనం

కాగజ్‌నగర్ టౌన్, మే 20: కాగజ్‌నగర్‌లోని సుభాష్‌కాలనీలో సోమవారం విష్ణు అనే వ్యక్తి వద్ద నుంచి 50 దేశీదారు బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్టు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు.

వైద్యం వికటించి బాలిక మృతి


సాయిపల్లవి (ఫైల్)

వేమనపల్లి, మే 20: ఆర్ఎంపీ వైద్యం వికటించి బాలిక మృతి చెందిన ఘటన వేమనపల్లి మండలంలో చోటు చేసుకుంది. నెన్నెల మండల కేంద్రానికి చెందిన కొమ్మెర అంజన్న-భాగ్యలక్ష్మీ దంపతుల కూతురు సాయి పల్లవి(11) వేసవి సెలవులు కావడంతో మండలంలోని కల్మలపేట గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చింది. ఆదివారం రాత్రి సాయి పల్లవికి ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు నీల్వాయికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు సంతోష్ వద్దకు తీసుకువెళ్లారు. ఆర్ఎంపీ వైద్యుడు ఇంజక్షన్ వేయగా అది వికటించి బీపీ, పల్స్ పడిపోయాయి. వెంటనే కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో చెన్నూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం బాలిక మృతి చెందింది. ఆర్ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యం కారణంగానే బాలిక మృతి చెందిందని కుటుంబ సభ్యులు నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్యామ్ పటేల్ తెలిపారు.

కారు, బైక్ ఢీ : ఇద్దరికి గాయాలు

బెల్లంపల్లి, మే 20: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఎదుట సోమవారం కారు బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. టూ టౌన్ ఏఎస్ఐ నర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం అరవింద్ అనే వ్యక్తి కారు నడుపుతూ ఒక్కసారిగా కుడి వైపు తిప్పడంతో ఆకెనపల్లికి చెందిన మల్లేష్, సింధూజ వెనక నుంచి బైక్‌పై వస్తుండగా కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరికి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మల్లేష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కారును అజాగ్రత్తగా నడిపిన అరవింద్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిరుతపులి చర్మం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న చిరుతపులి చర్మం, నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ, ఎఫ్‌డీవో

చెన్నూరు, మే 20 : మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం అర్జునగుట్ట-సిరొంచ మధ్య ఉన్న అంతర్రాష్ట్ర వంతెన వద్ద చిరుత పులి చర్మాన్ని స్వాధీనం చేసుకుని ఇరువురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం చెన్నూరు ఫారెస్టు డివిజనల్ అధికారి కార్యాలయంలో ఎఫ్‌డీవో రమేష్‌తో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. సోమవారం ఉదయం కోటపల్లి ఎస్ఐ రాజేందర్ అంతర్రాష్ట్ర వంతెన వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనాలపై ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణకు వస్తున్న ఇరువురు అనుమానాస్పదంగా కనిపించారు. వారి మోటారు సైకిళ్లను సోదా చేయగా వారి వద్ద చిరుతపులి చర్మం లభించింది. బీజాపూర్ జిల్లా భూపాలపట్నం బారెగూడ గ్రామానికి చెందిన దుర్గం పవన్ బోడగుట్ట అటవీ ప్రాంతంలో రెండు సంవత్సరాల క్రితం చిరుతపులిని హతమార్చాడు. చిరుతపులి చర్మాన్ని విక్రయించేందుకు అదే గ్రామానికి చెందిన బాబర్‌ఖాన్‌ను సంప్రదించాడు. పవన్, బాబర్‌ఖాన్‌లు చిరుతపులి చర్మాన్ని విక్రయించేందుకు మోటారుసైకిళ్లపై మంచిర్యాలకు వస్తుండగా పోలీసులకు చిక్కారు. చిరుతపులి చర్మంతోపాటు రెండు మోటారు సైకిళ్లు, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు.

వన్య ప్రాణులను హతమారిస్తే కఠిన చర్యలు

వన్యప్రాణులను హతమారిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎఫ్‌డీవో రమేష్ అన్నారు. అంతర్రాష్ట్ర వంతెన వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న చిరుతపులి చర్మాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. కోటపల్లి పోలీసులను ఆయన అభినందించారు.

హనుమాన్ మాలధారణకు వచ్చి మృతు ఒడిలోకి


కీర్తన్‌గౌడ్ (ఫైల్)

దండేపల్లి,మే 20: హనుమాన్ మాలధారణ స్వీకరించేందుకు వచ్చిన యువకుడు గోదావరి నదిలో మునిగి మృతి చెందిన సంఘటన గూడెం గోదావరి వద్ద సోమవారం చోటుచేసుకుంది. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామానికి చెందిన దుర్గం కీర్తన్‌గౌడ్ అలియాస్ రిషీ (19) అతని స్నేహితులు కోడూరి శేఖర్, గర్రెపల్లి వినయ్, వెగ్గలం అజయ్, దూలం మురళి, కొమ్మ సాయితో కలిసి గూడెంలోని హన్మాన్ గుడిలో దీక్ష స్వీకరించేందుకు బయలుదేరారు. దీక్షకు ముందు స్నానం చేసేందుకు స్నేహితులతో కలిసి గోదావరి నదిలో దిగారు. కీర్తన్‌గౌడ్‌కు ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు కేకలు వేయడంతో జాలర్లు గాలింపు చర్యలు చేపట్టగా అప్పటికే కీర్తన్‌గౌడ్ మృతి చెందాడు. మృతదేహాన్ని లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కీర్తన్‌గౌడ్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి తండ్రి తిరుపతిగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భూమేష్ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఏసీసీ, మే 20: మంచిర్యాల పట్టణంలోని మజీదు వాడకు చెందిన మహ్మద్‌ఖాజీ (52) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఖాజీ ట్రాలీ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పరిచయస్తులకు మధ్యవర్తిగా ఉండి డబ్బులు అప్పుగా ఇప్పించాడు. డబ్బులు తీసుకున్న వారు తిరిగి చెల్లించకపోవడంతో అప్పు ఇచ్చిన వారు మధ్యవర్తిగా ఉన్న ఖాజీని డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి ఇంటి సమీపంలోని రేకుల షెడ్డులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య మహ్మద్ బీబీ, కొడుకు మిథిన్ ఉన్నారు. కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఉపాధిహామీ కూలీ మృతి


మల్లవ్వ (ఫైల్)

దండేపల్లి, మే 20: దండేపల్లి గ్రామానికి చెందిన బంగారి మల్లవ్వ(48) ఉపాధిహామీ కూలీ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈనెల 17న ఉపాధిహామీ కూలీలతో వస్తున్న ఆటో ట్రాలీ కాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మల్లవ్వకు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మూడు రోజులపాటు చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. మృతురాలుకు భర్త, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతురాలి భర్త బంగారి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భూమేష్ తెలిపారు. ఇదే సంఘటనలో గాయపడిన మరో 15 మంది ఉపాధి కూలీలు పలు ఆసుప్రతిలో చికిత్స పొందుతున్నారు.

మృతురాలి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

దండేపల్లిలో ఆటో ట్రాలీ బోల్తా పడిన ప్రమాదంలో చికిత్స పొందుతూ ఉపాధిహామీ కూలీ బంగారి మల్లవ్వ మృతి చెందింది. మల్లవ్వ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో ఎంపీడీవో ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రమాదంలో గాయపడిన 16 మంది కూలీలకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలన్నారు. గాయపడిన కూలీలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని పేర్కొన్నారు. నాయకులు గుండ రవీందర్, చీర్ల వెంకటేశ్వర్లు, వనపర్తి రాకేష్, గురువయ్య, లక్ష్మన్ ఉన్నారు.

మృతురాలు మల్లవ్వ కుటుంబానికి, గాయపడిన కూలీలకు తక్షణ సాయం అందించి ఆదుకోవాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోళ్ళ రాజమల్లు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

మహిళలకు ఉపాధి కల్పిస్తున్న సింగరేణి సేవా సమితి


టైలరింగ్ నేర్చుకుంటున్న మహిళలు, బ్యూటీషియన్ నేర్చుకుంటున్న మహిళలు

మందమర్రిటౌన్, మే 20: సింగరేణిలో మహిళా సాధికారత అభివృద్ధి ఆర్థిక ప్రగతే ధ్యేయంగా సింగరేణి సేవా సమితి సేవలందిస్తోంది. రెండు దశాబ్దాలుగా సేవా సమితి చేయూతతో మహిళలు స్వయం ఉపాధి సాధిస్తూ కుటుంబాలకు పెద్ద దిక్కుగా నిలుస్తున్నారు. సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో సేవా సమితి ద్వారా యేటా వృత్తి శిక్షణ కోర్సులను ప్రవేశపెట్టి ఉపాధి కల్పిస్తోంది. మందమర్రిలో సేవా సమితి ఆధ్వర్యంలో మూడు నెలలుగా టైలరింగ్, మగ్గం వర్కు, పేపరు బ్యాగుల తయారీ, అల్లికలు, బ్యూటిషియన్ కోర్సులను నిర్వహిస్తోంది. మందమర్రి, రామకృష్ణాపూర్, భరత్‌కాలనీలో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. మందమర్రి ఏరియాలో ఇప్పటి వరకు 10 వేల మందికి పైగా శిక్షణ తీసుకుని స్వయం ఉపాధి పొందుతున్నారు. ప్రధానంగా మార్కెట్‌లో మగ్గం వర్కుకు డిమాండ్ ఉండడంతో శిక్షణపై మహిళలు ఆసక్తి చూపుతున్నారు. ఫ్యాషన్ దుస్తులకు మగ్గం వర్కు వేసి నెలకు రూ.30 వేలకు పైగా సంపాదిస్తున్నారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మగ్గం వర్క్ ఉచితంగా శిక్షణ ఇవ్వడం ద్వారా మహిళలు షాపులను ఏర్పాటు చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. సింగరేణి సేవా సమితి మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా ముందుకు సాగుతుంది. ఇప్పటి వరకు శిక్షణ పొందిన 9 వేల మంది ఖాదీ గ్రామోద్యోగి సంస్థ ద్వారా సర్టిఫికెట్లు పొంది తయారు చేసిన వస్తువులను విక్రయిస్తున్నారు.

మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యం

- సవితమనోహర్, సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు



మహిళలను అన్ని రంగాల్లో ముందుంచాలన్నదే సింగరేణి సేవా సమితి లక్ష్యం. సేవా సమితి ద్వారా మహిళలు, యువతులకు ఆయా వృత్తి శిక్షణ కోర్సులు ఇచ్చి వారిని నిష్ణాతులుగా చేయడంతో వారు సొంతంగా ఉపాధి పొందుతూ ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు. శిక్షణ కాలం పూర్తి కాగానే మరో బ్యాచ్‌తో మహిళలకు శిక్షణ ఇప్పిస్తు న్నాం. దీంతో శిక్షణ పొందిన మహిళలు ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య


శ్రీనివాస్ (ఫైల్)

భీమారం, మే 20 : భీమారం మండల కేంద్రానికి చెందిన కొమ్ము శ్రీనివాస్ (48) అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనివాస్ మండల కేంద్రంలో కిరాణ దుకాణం నడుపుతూ జీవిస్తున్నాడు. దుకాణంలో నష్టాలు రావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. శనివారం సాయంత్రం క్రిమిసంహారక మందు తాగగా కుటుంబీకులు గమనించి మంచిర్యాలలోని ఆసుపత్రికి అక్కడి నుంచి హైద్రాబాద్‌కు తరలించగా సోమవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య విజయ, కుమారుడు అభి ఉన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

బెల్లంపల్లి, మే 20 :బెల్లంపల్లి - మందమర్రి రైల్వేస్టేషన్‌ల మధ్య సబ్‌స్టేషన్ దగ్గర రైలు పట్టాలపై సోమవారం 45 నుంచి 50 సంవత్సరాలు గల గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. రైలు నుంచి పడి మృతి చెంది ఉంటాడని పేర్కొన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, నల్లని సన్నని గీతల తెల్లని షర్టు, నల్లని కాటన్ జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. వివరాలు తెలిస్తే 8712658596, 9948481902కు సమాచారం అందించాలన్నారు.

ముగిసిన ఉర్సు ఉత్సవాలు

సిర్పూర్(టి), మే 20: మండలకేంద్రంలోని డౌనల్ ఏరియాలో గల సయ్యద్ తాలీబ్‌అలీషాబాబా దర్గావద్ద మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉర్సు ఉత్సవాలు సోమవారం ముగిశాయి. సిర్పూర్(టి), కౌటాల, బెజ్జూరు, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, మంచిర్యాల తదితర ప్రాంతాలతోపాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి దర్గావద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా రాత్రి సమయాల్లో ఏర్పాటు చేసిన కవ్వాలి కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకుంది. ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగ కుండా అన్ని చర్యలు తీసుకున్నారు.

ట్రస్మా జిల్లా కార్యవర్గం

కాగజ్‌నగర్, మే 20: ట్రస్మా జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా దేవభూషణం, గౌరవ అధ్యక్షుడిగా పెద్దపల్లి కిషన్‌రావు, ప్రధానకార్యదర్శిగా తిరుపతిచారి, ట్రెజరర్‌గా రాజేంద్రప్రసాద్, వర్కింగ్ ప్రసిడెంట్‌గా సంజీవ్‌కుమార్, అసోసియేట్ ప్రసిడెంట్‌గా సితాని, స్పోక్స్‌పర్సన్‌గా నరేందర్, లీగల్ అడ్వయిజర్‌గా రాపర్తి రవీందర్, చీఫ్‌అడ్వయిజర్‌గా గోపాల్ మహేశ్వర్ రావు, ఉపాధ్యాక్షులుగా తిరుపతి, రాజయ్య, రమన్ తదితరులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిని సభ్యులు ఘనంగా సన్మానించారు.

కలగానే వంతెన నిర్మాణం


ఉధృతంగా ప్రవహిస్తున్న దిందా వాగు(ఫైల్)

చింతలమానేపల్లి, మే 20: మండలంలోని దిందా- కేతిని గ్రామాల మధ్య ఉన్న వాగుపై లోలెవల్ వంతెన ఉన్నప్పటికీ వర్షం వచ్చిన ప్రతిసారి నీటి ఉధృతితో ఉప్పొంగి పోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈవాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలని కొన్నేళ్లుగా అక్కడి గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నా ఆ నిర్మాణం కలగానే మారింది. వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరైనా అటవీశాఖ అనుమతులు పూర్తిగా లేకపోవడంతో వంతెన నిర్మాణం జరగడం లేదు. ప్రతి ఏడాది వర్షాకాలంలో అనేక అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షా కాలంలో కూడా ఇబ్బందులు పడాల్సిందేనని వారు ఆవే ధన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని నీటి ఉధృతిలోనూ ప్రయాణించాల్సి వస్తోందంటున్నారు. ఈ వర్షాకాలం కూడా ఇబ్బందులు తప్పేలా లేవని పేర్కొంటున్నారు. గతంలో వంతెన నిర్మించాలని దీక్షలు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని, అధికారులు వంతెన నిర్మాణం కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామ స్తులు ఆరోపిస్తున్నారు. వంతెన నిర్మాణానికి ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


వంతెన నిర్మించాలని దీక్ష చేస్తున్న గ్రామస్థులు(ఫైల్)

గ్రూప్-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్‌దోత్రే

ఆసిఫాబాద్, మే 20: జూన్ 9న జరగనున్న గ్రూప్-1 పరీక్షలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో టీఎస్‌పీఎస్ చైర్‌పర్సన్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ సురేష్‌తో కలిసి జిల్లా అధికారులతో పరీక్ష నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 9న జరగనున్న గ్రూప్-1 పరీక్షకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పరీక్షల నిర్వహణకు అదనపు కలెక్టర్‌ను నోడల్ అధికారిగా నియమించామన్నారు. సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుంటూ ఎలాంటి పొరపాట్లు లేకుండా పరీక్ష నిర్వహించాలని తెలిపారు. పరీక్ష కొరకు సమీకృత జిల్లాకార్యాలయాల భవన సముదాయంలో స్ట్రాంగ్‌రూం ఏర్పాటు చేశామన్నారు. ప్రశ్నాపత్రాలను పోలీసు బందోబస్తుమధ్య పరీక్షకేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరీక్ష నిర్వహణకు జిల్లాలో 13కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 4ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తామన్నారు. ఈ క్రమంలో శాఖపరమైన సమస్యలను వెంటనేపరిష్కరించుకొని పరీక్ష నిర్వహణకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా అసాంఘికశక్తుల నియంత్రణపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. స్ట్రాంగ్‌రూంవద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. బయోమెట్రిక్ విధానం ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు జరుగుతాయన్నారు. సంబంధిత అధికారులకు 22న శిక్షణ ఇస్తామని తెలిపారు. పరీక్షకేంద్రాల్లో ఇన్విజిలేటర్లకు విషయ పరిజ్ఞానం ఉండాలన్నారు. పరీక్షసమయాన్ని గంట మొగిస్తూ అభ్యర్థులకు తెలియజేయాలని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి ఒక గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అభ్యర్థులకు ఉదయం 9గంటలకు ఏర్పాటు చేయబడిన పరీక్షాకేంద్రంలోనికి అనుమతి ఉంటుందన్నారు. 9.30 గంటలకు బయోమెట్రిక్ చెకింగ్‌తోపాటు 10గంటల వరకు ప్రవేశానికి అనుమతి ఉంటుందన్నారు. 10 గంటల తర్వాత పరీక్ష కేంద్రంలోని అనుమతించరని తెలిపారు. సెల్‌ఫోన్, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుతించమని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉచాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఒక వైద్యబృందాన్ని నియమించి అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకేట్లు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. పరీక్ష సమయంలో అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగ కుండా పారిశుధ్యం, తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా అంశాలపై ప్రత్యేకచర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష నిర్వహణలో అధికారులు నియమ నిబంధనలు తప్పని సరిగా పాటించాలన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి..

జిల్లాలో జరగనున్న ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, పాలిసెట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బం దీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు దీపక్‌తివారి, దాసరి వేణు, ఎస్పీ సురేష్‌కుమార్, కాగజ్‌నగర్ ఆర్డీవో సురేష్‌తో కలిసి జిల్లా అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1200మంది విద్యార్థులు పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కానున్నారని అన్నారు. అందులో ఆసిఫాబాద్ మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల, కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల, బాలుర పాఠశాల, సిర్పూర్(టి) మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు, జూన్ 3నుంచి 13వరకు ఉదయం 9.30 నుంచి 12.30గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలను ఈనెల 24నుంచి జూన్ 3వ తేదీ వరకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ప్రథమసంవత్సరంలో 1938మంది, ద్వితీయ సంవత్సరంలో 1051మంది విద్యార్థులు హాజరు కానున్నారని అన్నారు. ఇందు కోసం జిల్లాలోని ఆసిఫాబాద్‌లో 2, కాగజ్‌నగర్‌లో 2, జైనూరు, తిర్యాణి, రెబ్బెన, కౌటాల, వాంకిడి, కెరమెరి, సిర్పూర్(యు)లో ఒక్కోకేంద్రం చొప్పున ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఈనెల 24న పాలిసెట్ పరీక్షనిర్వహణకు జిల్లాలో 4పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈనేపథ్యంలో సంబంధిత శాఖల ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని, పరీక్షా కేంద్రల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని తెలిపారు. పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్ అవకాశం లేకుండా ఫ్లయింగ్, సిట్టింగ్‌స్క్వాడ్‌లు పర్యవేక్షిస్తారన్నారు. అలాగే సకాలంలో పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకునే విధంగా ఆర్టీసీ బస్సులు నడిపించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు ఎలాంటి అస్వస్థతకు గురికాకుండా అవసర మైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఆరోగ్య కార్యకర్తలను అందుబాటులో ఉంచుతామని అన్నారు. పరీక్ష సమయంలో విద్యుత్‌సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవా లని, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగే విధంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

తీరని కాంట్రాక్టు కార్మికుల కష్టాలు

● పర్మినెంటు కోసం ఎదురుచూపులు ● అమలు కాని హైపవర్ వేతనాలు


జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు(ఫైల్)

రెబ్బెన, మే 20: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల అవస్థలు పరిష్కారం కావటం లేదు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11ఏరియాల్లో సుమారు 20 వేలకుపైగా కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. బొగ్గు ఉత్పత్తిలో కాంట్రాక్టు కార్మికులు పర్మినెంటు కార్మికులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారు. కానీ వేతనాలు సమానంగా రావటం లేదని అంతా వాపోతున్నారు. అదేవిధంగా పర్మినెంటుకు నోచుకోవటం లేదు. సింగరేణి సంస్థలో జరిగే బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలో కీలకపాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికులను యాజమాన్యం ఏ మాత్రం పట్టించుకోవటం లేదు. సింగరేణిలో సంస్కరణల ఫలితంగా 1.20లక్షల మంది కార్మికుల నుంచి 40వేలమందికి కార్మికులు తగ్గిపోయారు. పర్మినెంటు కార్మికులను తొలగించి వారిస్థానంలో కొత్తగా భర్తీ చేయకుండా యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులతో కాలం వెల్లదీస్తోంది. కాంట్రాక్టు కార్మికులకు కనీసవేతనాలు కూడా అమలు కావటం లేదు. సింగరేణి సంస్థలో రెగ్యులర్ కార్మికులకు దీటుగా కాంట్రాక్టు కార్మికులు అన్ని విభాగాల్లోనూ పని చేస్తున్నారు. బొగ్గు ఉత్పత్తి మొదలు బొగ్గు సరఫరా, సంక్షేమం రంగాల్లో కాంట్రాక్టు కార్మికుల సంఖ్య పెరిగింది. బొగ్గు ఉత్పత్తి, రవాణా, స్టోర్స్, పారిశుధ్యం, బెల్ట్ క్లీనింగ్, తోటమాలి, హౌజ్ కీపింగ్ తదితర వాటిల్లో కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. జీవో22 ప్రకారం మైనింగ్ యాక్టు ప్రకారం వేతనాలు చెల్లించాల్సి ఉంది.

పర్మినెంటు కోసం ఎదురుచూపులు..

పదిహేను సంవత్సరాలకుపైగా సంస్థలో కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. చాలీచాలని వేతనాలతో ఆర్థికఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్థిక ఇబ్బందుల నడుమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. తాను గద్దెనెక్కితే పర్మినెంటు చేస్తానని 2014 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేసీఆర్ హామీ కూడా ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత పర్మినెంటు విషయం ఊసేత్తలేదు. అలాగే మిగితా కార్మిక సంఘాలు కూడా ఏ మాత్రం పట్టించుకో లేదు. తమ పర్మినెంటు సమస్య ఎప్పటికీ తీరుతుందోనని అంతా వేచి చూస్తున్నారు. ఇప్పుడు వేతనాల ప్రకారం కాంట్రాక్టు కార్మికులు రోజుకు అన్‌స్కిల్డ్ రూ.522, సెమిస్కిల్డ్ రూ.610, స్కిల్డ్ రూ.734, హైస్కిల్డ్ రూ.862 చెల్లిస్తున్నారు. అది కూడా ఈ నెల నుంచే అమలు చేస్తున్నారు. హైపవర్ వేతనాలకు ఇప్పటికీ కాంట్రాక్టు కార్మికులు నోచుకోవటం లేదు. అలాగే చట్టబద్దంగా రావాల్సిన బోనస్, సీఎంపీఎఫ్, వైద్య సౌకర్యం ఇతర సౌకర్యాలు కల్పించాలని ఒప్పందం కూడా ఇంత వరకు అమలు కావటం లేదు. బోనస్-2006 చట్టం ప్రకారం చెల్లించాల్సిన బోనస్ ఇంత వరకు యాజమాన్యం ఇవ్వటం లేదు.

వేతనాన్ని వెంటనే పెంచాలి..
-బోగే ఉపేందర్, ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ



సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాన్ని వెంటనే పెంచాలి. పెరిగిన జీవో ప్రకారం జీతాలు చెల్లించాలి. పర్మినెంటు విషయంలో కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. బోనస్-2006 చట్టం ప్రకారం కూడా చెల్లించాలి. కుటుంబాలకు కార్పొరేట్ వైద్యసౌకర్యం కల్పించాలి.

సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలి..
-సురేందర్, కాంట్రాక్టు కార్మికుడు



సింగరేణి కార్మికులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నాం. సంక్షేమకార్యక్రమాలు కాంట్రాక్టు కార్మిక కుటుంబాలకు కూడా వర్తింపజేయాలి. వేతనాలు, బోనస్‌విషయంలో కూడా అధికారులు ప్రత్యేకచర్యలు తీసుకోవాలి. కాంట్రాక్టు కార్మికులు కష్టాల కడలిలో ఉన్నారు. యాజమాన్యం స్పందిస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయి.

హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి
-సాగర్ గౌడ్, కాంట్రాక్టు కార్మికుడు



సింగరేణిలోపని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు హైపవర్‌కమిటీ సూచించిన వేతనాలు చెల్లించాలి. నామమాత్రపు వేతనాలతో కుటుంబ పోషణ కష్టమవుతోంది. యాజమాన్యం వెంటనే స్పందించాలి. చాలా కష్టాల్లో ఉన్నాం. అధికారులు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరిస్తే బాగుటుంది.

ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

మంచిర్యాల

జిల్లా వార్తలు

3

మంగళవారం 21 మే 2024





'కడెం' ఆయకట్టు సాగయ్యేనా..?

- వానాకాలం సాగుకు రైతులు సన్నద్ధం
- ప్రాజెక్టు నీటి విడుదలపై సందేహాలు
- గత సీజన్‌లో ప్రమాదకర స్థితికి రిజర్వాయర్
- మరమ్మతులు పూర్తయితేనే సాగునీరు
- ప్రాజెక్టుపై ఆధారపడ్డ 40వేల ఎకరాలు

మంచిర్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి): వానాకాలం వరిసాగు కోసం గూడెం లిఫ్ట్‌పై ఆధారపడ్డ ఆయకట్టు రైతుల పరిస్థితి సందిగ్ధంలో పడింది. గూడెం ఎత్తిపోతలకు నీరందించే కడెం రిజర్వాయర్ గతేడాది వర్షాకాలంలో వరద తాకిడికి గురై ప్రమాదకర పరిస్థితికి చేరుకొంది. కట్ట తెగిపోయే పరిస్థితి ఉండటంతో స్పందించిన ప్రభుత్వం ప్రాజెక్టులోని నీటిని దిగువకు వదిలి ఖాళీ చేసింది. ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు డెడ్ స్టోరేజీకి చేరుకోగా, సాగునీటి విడుదలపై నీలినీడలు అలుముకున్నాయి.

40 వేల ఎకరాలకు సాగునీరు...

నిర్మల్ జిల్లా కడెం రిజర్వాయర్ నుంచి జిల్లాలోని దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో సుమారు 40వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. కడెం ప్రాజెక్టు నీటిని గూడెం ఎత్తిపోతల పథకం పంప్‌హౌజ్ నుంచి దండేపల్లి మండలంలోని తానిమడుగు వరకు 12.01 కిలో మీటర్లు పొడవున పైప్‌లైన్ ద్వారా కడెం ప్రాజెక్టు 30వ డిస్ట్రిబ్యూటరీ వద్ద నిర్మించిన ప్రధాన కాలువలోకి నీటిని విడుదల చేస్తారు. అక్కడి నుంచి హాజీపూర్ మండలం 42వ డిస్ట్రిబ్యూటరీ ఆయకట్టు వరకు 40 ఎకరాల్లోని పంటలకు సాగునీరు అందించాల్సి ఉంది.

నీటి విడుదలలో తరుచూ అవరోధాలు...

గూడెం ఎత్తిపోతల పథకం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు సాగునీటి విడుదలలో తరుచూ అవరోధాలు ఎదురవుతూనే ఉన్నాయి. ప్రస్తుతం కడెం ప్రాజెక్టు మరమ్మతుల కారణంగా నీటి విడుదలపై సందేహాలున్నాయి. గూడెం లిఫ్ట్‌లో సాంకేతిక లోపం కారణంగా సమస్యలు ఏర్పడుతుండేవి. గూడెం లిఫ్ట్‌కు డీపీఆర్ ప్రకారం డీఐ పైపులు వేయాల్సి ఉండగా జీఆర్పీ పైపులైన్ వేశారు. లిఫ్ట్‌లోని రెండు మోటార్లు ఆన్ చేస్తే 290 క్యూసెక్కుల నీరు ఎత్తిపోసి మూడు మండలాల్లోని పంటలకు సరిపడా నీరందే అవకాశాలు ఉంటాయి.

ఇలా రెండు మోటార్లు ఆన్‌చేసిన ప్రతిసారీ ప్రెజర్‌కు తట్టుకోలేక జీఆర్పీ పైపులు పగులుతుండేవి. లిఫ్ట్ ప్రారంభించిన తొమ్మిది సంవత్సరాల వ్యవధిలో 85 సార్లు పైపులు పగిలి పంటలకు నీరందని పరిస్థితులు తలెత్తాయి. రైతులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో జీఆర్పీ తొలగించి డీఐ పైపులు వేయడంతో కొంత సమస్యకు పరిష్కారం లభించినా, సిబ్బంది కొరత కారణంగా పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరు అందడం లేదు. కడెం ప్రాజెక్టు ద్వారా గ్రావిటీ విధానంలో దండేపల్లి మండలం వరకు నీరు విడుదల కావలసి ఉంది. ఇందుకుగాను షెడ్యూల్ ప్రకారం నీటిని విడుదల చేయాలంటే ప్రాజెక్టు గేట్లు 6.5 ఫీట్ల మేర ఎత్తాలి. అప్పుడే నిర్ణీత ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందే అవకాశాలు ఉంటాయి. తపాల్‌పూర్ డిస్ట్రిబ్యూటర్ 19 నుంచి 28 వరకు దండేపల్లి మండలంలోని పంటలకు నీరు వస్తుంది. అయితే దీనికి భిన్నంగా కేవలం తపాల్‌పూర్ వరకు సరిపడా మాత్రమే 3.5 ఫీట్ల వరకు నీరు ఎత్తుతున్నట్లు సమాచారం. దీంతో సీజన్‌లో నిర్ణీత 40వేల ఎకరాలకు నీరు అందడంలేదు. సిబ్బంది కొరత కారణంగా కొంతభాగం చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. కడెం ప్రధాన కాలువ వెంట నీటిని విడుదల చేయడానికి గతంలో 102 మంది సిబ్బంది ఉండేవారు.

కడెం కెనాల్ డీ1 నుంచి 28 వరకు వీరు పనిచేసేవారు. దీంతో ఎప్పటికప్పుడు కెనాల్ గేట్లు తెరిచి, నీటిని విడుదల చేసేవారు. ప్రస్తుతం కేవలం 16 మంది మాత్రమే పని చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీరిలో 12 మంది గ్యాంగ్‌మెన్, 4గురు వర్క్ ఇనెస్పెక్టర్లు ఉన్నారు. ఈ కారణంగా నీటిని సకాలంలో విడుదల చేయక పంటలు ఎండిపోయే పరిస్థితులు తలెత్తాయి. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించి, సకాలం లో నీరందించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు పూర్తయ్యేనా..?

గతేడాది వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా వరద తాకిడికి ప్రాజెక్టు కొట్టుకుపోయే పరిస్థితి ఉండడంతో గేట్లు తెరిచి నీటిని దిగువన గోదావరిలోకి వదిలారు. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరింది. ప్రాజెక్టు గరిష్ట మట్టం 700 ఫీట్లుకాగా, 7.603 టీఎంసీల నీరు నిల్వ సామర్థ్యం ఉంది. నీటిని వదిలివేయడంతో ప్రస్తుతం 2.507 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీరు అందుబాటులో ఉంటే తప్ప సాగునీరు లభించే పరిస్థితి ఉండదు. వర్షా కాలం సమీపిస్తున్నందున అప్రమత్తమైన ప్రభుత్వం ప్రాజెక్టుకు మరమ్మ తులు చేపడుతోంది. ప్రస్తుతం ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారుల సమక్షంలో ఆ శాఖ ప్రాజెక్టుకు అవసరమైన మరమ్మతులు చేపడుతోంది. మరమ్మతు పనులు ప్రారంభమైనప్పటికీ నిర్ణీత గడువులోగా పూర్తవుతాయా అనే సందేహాలు నెలకొన్నాయి. మరోవైపు వానాకాలం సాగుకోసం రైతులు సన్నద్ధమవుతున్నారు. నెల రోజుల్లో పూర్తిస్థాయిలో పంటలు సాగులోకి వచ్చే అవకాశాలున్నాయి. ఆలోగా కడెం ప్రాజెక్టు పనులు పూర్తయి, ప్రాజెక్టులో నీరు నింపితేనే చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందే అవకాశాలున్నాయి. మరోవైపు మరమ్మతు పనులు సకాలంలో పూర్తి చేస్తామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.





ప్రాజెక్టుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

చెరువు వాటా ఇవ్వాలని ముదిరాజ్‌ల ఆందోళన



పెద్ద చెరువు వద్ద ఆందోళన చేస్తున్న ముదిరాజ్ కులస్తులు

చెన్నూరు, మే 20: చెన్నూరు పెద్ద చెరువులో వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ముదిరాజ్ కులస్తులు పెద్ద చెరువు వద్ద ఆందోళన చేపట్టారు. ముదిరాజ్ కులస్తులు మాట్లాడుతూ 60 ఏండ్లుగా స్థానిక పెద్ద చెరువులో గంగ పుత్రులు, ముదిరాజ్ కులస్థులకు వాటాలు ఉన్నాయని తెలిపారు. రెండు కులాలకు సమాన వాటాలు ఉన్నట్లు 1998లో పెద్ద మనుషుల మధ్య ఒప్పందం కుదిరిందన్నారు. లిఖిత పూర్వకంగా ఇరు కులాలకు చెందిన పెద్దమనుషులు పత్రాలు రాసుకున్నారని తెలిపారు. కొంత కాలం క్రితం కొందరు గంగపుత్రులు ముదిరాజ్ కులస్థులకు తెలియకుండా బోగస్ సభ్యుల పేర్లతో అధికారులకు లంచాలు ఇచ్చి అక్రమంగా సొసైటీ చేసుకున్నారని ఆరోపించారు. సొసైటీ పేరుతో ఇతర జిల్లాల నుంచి చేపలు పట్టే వారిని తీసుకుని వచ్చి చేపలు పట్టి అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సొసైటీలో ఉన్న సభ్యుల వివరాలు సేకరించి బోగస్ సభ్యుల పేర్లను తొలగించాలన్నారు. గతంలో పెద్ద మనుషుల మధ్య కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ముదిరాజ్ కులస్థులకు చెరువులో వాటా ఇవ్వాలన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటేశ్వర్‌రావు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కరకట్టల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

హాజీపూర్, మే 20: మంచిర్యాల పట్టణాన్ని వరదల ముంపు బారి నుంచి రక్షించాలంటే వెంటనే కరకట్టల నిర్మాణం చేపట్టాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో వర్షాకాలంలో జిల్లాలో వందలాది ఎకరాల పంటల భూములు ముంపునకు గురై రైతులు నష్టపోతున్నారన్నారు. అంతేకాకుండా వేంపల్లి, మంచిర్యాల తదితర ప్రాంతాల్లో ఇండ్లు నీటిలో మునిగి ఆస్తి నష్టం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి ముందు చూపు లేక చేసిన పనికి ప్రజలు, రైతులు నష్టపోతున్నారన్నారు. మంచిర్యాల పట్టణానికి ముంపు నుంచి విముక్తికి కరకట్టల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని కోరారు. నాయకులు మాధవరపు వెంకటరమణరావు, బొలిశెట్టి తిరుపతి, మడిపెల్లి సత్యనారాయణ, రాయిలి మల్లేష్, శ్రీనివాస్, రాజనర్సు, స్వామి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ చెరువు కబ్జాకు గురికాకుండా చూడాలి

ఏసీసీ, మే 20: పట్టణంలోని పోచమ్మ చెరువును కబ్జా చేసేందుకు రియల్ ఎస్టేట్ మాఫియా, భూకబ్జాదారులు కుట్రలు పన్నుతున్నారని బీజేపీ సీనియర్ నాయకుడు తుల మధుసూదన్‌రావు అన్నారు. సోమవారం పోచమ్మ చెరువును సందర్శించి మత్తడిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని దుండగులు చెరువు మత్తడిని ధ్వంసం చేసి కందకం తవ్వారన్నారు. ఎమ్మెల్యే పోచమ్మ చెరువుపై ప్రత్యేక దృష్టి పెట్టి కాపాడాలని, మత్తడిని ధ్వంసం చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంపై కలెక్టర్, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. సోమ రాములు, దాస్యనాయక్, చంద్రయ్య, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడం కూల్చివేత

కన్నెపల్లి, మే 20: జన్కాపూర్ పంచాయతీలోని చెరువు కట్టపై అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చి వేశారు. ప్రభుత్వ భూమి అని బోర్డును ఏర్పాటు చేశారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కట్టడాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు

మంచిర్యాల కలెక్టరేట్, మే 20: జిల్లాలో ఎండలు మండుతున్నాయి. రెండు మూడు రోజులుగా అక్కడక్కడ వర్షాలు కురిసి వాతావరణం చల్లబడగా సోమవారం ఒక్కసారిగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ప్రజలు ఎండవేడి, ఉక్కబోతతో ఇబ్బందిపడ్డారు. కాసిపేట మండలం కొండాపూర్‌లో 42.2 డిగ్రీలు, నస్పూర్‌లో 41.2 డిగ్రీలు, హాజీపూర్‌లో 41.0, జన్నారంలో 40.9, బెల్లంపల్లి, చెన్నూరులో 40.6, దండేపల్లిలో 40.5, మంచిర్యాలలో 40.4, లక్సెట్టిపేటలో 40.3, భీమినిలో 40.2, నెన్నెల, తాండూర్‌లో 40.0 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కోటపల్లి, భీమారం, జైపూర్, జన్నారంలో 39.9, మందమర్రిలో 39.7, కన్నెపల్లిలో 39.6, చెన్నూరులో 38.5 డిగ్రీలు నమోదయ్యాయి.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీరాంపూర్, మే 20: శ్రీరాంపూర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చందర్ ఒక ప్రకటనలో తెలిపారు. తేది: 01-03-2024 నాటికి 14 ఏళ్లు నిండి పదో తరగతి పాస్ అయినవారు అర్హులని పేర్కొన్నారు. కోపా-48 సీట్లు, డీజిల్ మెకానిక్-24, ఎలక్ట్రీషియన్-20, ఫిట్టర్-20, డ్రాఫ్ట్‌మెన్ సివిల్-24 సీట్ల చొప్పున ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో జూన్ 10వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఫోన్ నెంబర్, ఈ-మెయిల్ ఐడి తప్పనిసరిగా పొందుపర్చాలని సూచించారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాల కలెక్టరేట్, మే 20: 2024-25 విద్యా సంవత్సరానికిగాను బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో గిరిజన విద్యార్థులకు 3, 5, 8 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు 41 సీట్లు కేటాయించగా 3వ తరగతిలో 21, 5వ తరగతిలో 10, 8వ తరగతిలో 10 సీట్లు ఉన్నాయని తెలిపారు. జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తులు ఉచితంగా ఇస్తారని, ఈ నెల 21 నుంచి జూన్ 6లోగా సంబంధిత ధ్రువపత్రాలు జత చేసి దరఖాస్తులను జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మందమర్రిరూరల్, మే 20: మండలంలోని అందుగులపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతు, చెట్ల కొమ్మల కొట్టివేత వల్ల మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మల్లేశం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాపల్, ఊరు మందమర్రి, ఎర్రగుంటపల్లి, అందుగులపేట, బొక్కలగుట్టలో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన డీసీవో

చెన్నూరు, మే 20: మండలంలోని సోమనపల్లి పంచాయతీ పరిధి దుబ్బపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం డీసీవో నర్సయ్య పరిశీలించారు. కేంద్రంలో కటింగ్‌ల పేరుతో రైతులను మోసం చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు రైతులతో, కేంద్రం నిర్వాహకులతో మాట్లాడారు. కేంద్రంలో ఎలాంటి రశీదులు ఇవ్వడం లేదని రైతులు తెలిపారు. రెండు లారీల ఎకనాలెడ్జ్‌మెంట్ వచ్చాక పూర్తి స్థాయిలో పరిశీలిస్తామని డీసీవో తెలిపారు. సహకార శాఖ అసిస్టెంట్ అధికారి రవికిశోర్, సీఈవో రత్న లక్ష్మారెడ్డి ఉన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, మే 20: జిల్లాలో జరగనున్న ఇంటర్మీడియట్, పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా ఇంటర్మీడియట్, పోలీసు, పంచాయతీ, రెవెన్యూ, మున్సిపల్, అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలను ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 4510 మంది జనరల్, 402 మంది ఒకేషనల్, ద్వితీయ సంవత్సరంలో 2005 మంది జనరల్, 383 మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. పదో తరగతి పరీక్షలను జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయని, ఇందుకోసం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాల ల్లో కేంద్రాలను ఏర్పాటు చేశా మన్నారు. 704 మంది హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షల కోసం అవసరమైన సిబ్బందిని నియమించామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. పరీక్షలు సజావుగా సాగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శైలజ, డీపీవో వెంకటేశ్వర్‌రావు, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, ఆరోగ్య శాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సీఐ అశోక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాల కలెక్టరేట్, మే 20: ప్రజా సంక్షేమం, దేశ అభివృద్ధి దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకొంటున్నామని అదనపు కలెక్టర్ రాహుల్ పేర్కొన్నారు. కేంద్ర సర్వీసులకు చెందిన వివిధ శాఖల సహాయ విభాగాల అధికారులకు కలెక్టరేట్‌లో విలేజ్ అటాచ్‌మెంట్ మాడ్యూల్ అంశంపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని డీపీవో వెంకటేశ్వర్‌రావు, డీఆర్‌డీవో కిషన్, సంక్షేమాధికారి చిన్నయ్య, డీఎంహెచ్‌వో అనిత, జిల్లా వ్యవసాయాధికారి కల్పనతో కలిసి ప్రారంభించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 24 వరకు కేంద్ర సర్వీసులకు చెందిన సహాయ విభాగాల అధికారులు శిక్షణ కార్యక్రమంలో జిల్లాలో వారికి కేటాయించిన గ్రామాల్లో పర్యటించి సంక్షేమ పథకాలను పరిశీలిస్తారన్నారు. వీరికి సహాయంగా ఎంపీడీవోలను నోడల్ అధికారులుగా నియమించామని తెలిపారు. డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

భీమారం, మే 20: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ చెరుకు దీపి కారెడ్డి అధ్యక్షతన సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని జెడ్పీటీసీ భుక్య తిరుమల, ఎంపీటీసీ పెద్దల రూపతో పాటు వివిధ శాఖలకు చెందిన ఆరుగురు అధికారులు మాత్రమే హాజరయ్యారు. దీంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ మండల అభివృద్ధికి సహకరించిన వివిధ శాఖల అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. మండల అభివృద్ధికి అందరూ కృషి చేయాలని పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరగా పూర్తి చేయడానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాథోడ్ రాధ, ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్ఆర్ఈజీఎస్, ఐకేపీ, వ్యవసాయ శాఖ తదితర అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూంల పరిశీలన

హాజీపూర్, మే 20: ముల్కల గ్రామంలోని ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో గల స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రత ఏర్పాట్లు, కంట్రోల్ రూమ్‌లను సోమవారం కలెక్టర్ బదావత్ సంతోష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న ఎన్నికలు జరిగగా జూన్ 4న కౌంటింగ్ ఉంటుందని, ఈ క్రమంలో స్ట్రాంగ్‌రూంలలో ఈవీఎంల రక్షణకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్‌లను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపాల్, తహసీల్దార్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే అభివృద్ధి

మందమర్రి టౌన్, మే 20: మహిళలు ఆర్థిక ప్రగతి సాధించినప్పుడే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి (ఎస్ఈటీ) ఇన్‌చార్జి రవి కాంతరావు తెలిపారు. సోమవారం శ్రీపతినగర్‌లో నిర్వహిస్తున్న వయోజన విద్యా కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. పోటీ ప్రపంచంలో మహిళలు తమ పని నైపుణ్యాలను పెంచుకొని వారికి అనువైన రంగాల్లో రాణించాలన్నారు. విద్యతోనే ఉన్నతస్థాయికి చేరుకుంటారని చెప్పారు. వయోజన కేంద్రాల్లో విద్యను అభ్యసిస్తున్న వారు ఆసక్తి ఉంటే ఓపెన్ ఇంటర్, డిగ్రీ అభ్యసించాలని, చదువుకు వయసుతో ఎలాంటి సంబంధం లేదన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతి, వయోజన సంచాలకులు పురుషోత్తంనాయక్, వయోజన విద్య ఎస్‌వో ఎస్ మూర్తి, శాంఖరి, ప్రకాశం, సువర్ణ, రమేష్, గోపిక, శారద, పాల్గొన్నారు.



మందమర్రి, కన్నెపల్లిలో మాట్లాడుతున్న ఎస్ఐఈటీ రాష్ట్ర ఇన్‌చార్జి డాక్టర్ రవికాంత్‌రావు

అక్షరాస్యత కార్యక్రమాన్ని నిరంతరం చేపట్టాలి

కన్నెపల్లి: నిరక్షరాస్యత నిర్మూలనకు అక్షరాస్యత కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగేలా ప్రభుత్వం న్యూ ఇండియా లిట్రసీ ప్రోగ్రాంను ప్రవేశపెట్టిందని ఎస్ఐఈటీ రాష్ట్ర ఇన్‌చార్జి, ప్రొఫెసర్ డాక్టర్ రవికాంత్‌రావు అన్నారు. మండల కేంద్రంలో వయోజన విద్యాశాఖ, సఖి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న అక్షరాస్యత, కుట్టు శిక్షణ కేంద్రాలను సోమవారం సందర్శించారు. జిల్లాలో వయోజన శాఖ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రాల్లో అక్షరాస్యత నేర్పడం గొప్ప విషయమన్నారు. మహిళలు టీవీ సీరియళ్లు చేస్తే ఏమిరాదని, ఆ సమయాన్ని ఉపాధి నైపుణ్యాలు పెంచుకోవడానికి కేటాయిస్తే భవిష్యత్ బాగుంటుందన్నారు. జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతి, జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారి సత్యనారాయణమూర్తి, కన్నెపల్లి బ్యాంకు అధికారి గురుమూర్తి, సఖి లైన్స్ క్లబ్ అధ్యక్షురాలు బండ శాంకరి, డీఆర్‌పీలు సువర్ణ, ప్రకాశం, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.